సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం। 18। ఏప్రిల్। 2024



టన్ను చీనీ రూ.37 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.37 వేలు పలికాయి. మార్కెట్‌కు 991 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



కిలో టమాట రూ.15
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.15, కనిష్టంగా రూ.6, సరాసరిన రూ.10 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
42.7°/22.1°
జిల్లా పరిధిలో బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు పెరిగాయి. వేసవితాపం ఎక్కువైంది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.


న్యూస్‌రీల్

జిల్లాకు ఎన్నికల వ్యయ పరిశీలకులు

పుట్టపర్తి అర్బన్: అసెంబ్లీ, పార్లమెంట్ నియోజక వర్గాల పర్యవేక్షణ నిమిత్తం బుధవారం పలువురు ఎన్నికల వ్యయ పరిశీలకులు జిల్లాకు విచ్చేసినట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి అమిత్ కుమార్, మడకశిర, హిందూపురం, పెనుకొండ అసెంబ్లీ నియోజక వర్గాలకు వినాయక్, పుట్టపర్తి, ధర్మవరం, కదిరి అసెంబ్లీ నియోజకవర్గాల వ్యయాన్ని రిథమ్ భజ్వా పరిశీలించనున్నట్లు ఆయన వెల్లడించారు. గురువారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అనంతరం ఖర్చు చేసే ప్రతి రూపాయిని అభ్యర్థుల ఖర్చు కింద చూపనున్నట్లు చెప్పారు. అసెంబ్లీ నియోజక వర్గానికి పోటీ చేసే అభ్యర్థి ఖర్చు రూ.40 లక్షలు, పార్లమెంట్ నియోజక వర్గానికి పోటీ చేసే అభ్యర్థి ఖర్చు రూ.95 లక్షలకు మించరాదన్నారు.

ప్రతి వాహనాన్నీ తనిఖీ చేయాలి

- పుల్లట్ల కనం చెక్‌పోస్టును పరిశీలించిన ఎస్పీ మాధవరెడ్డి



తాడిమర్రి మండలం దాడితోట వద్ద చెక్ పోస్టును తనిఖీ చేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

తాడిమర్రి: చెక్‌పోస్టుల వద్ద ప్రతి వాహనాన్నీ తనిఖీ చేయాలని ఎస్పీ మాధవరెడ్డి పోలీసులను ఆదేశించారు. బుధవారం ఆయన మండలంలోని దాడితోట సమీపంలో పుల్లట్ల కనంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ.. విధుల్లో ఉంటున్న సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన వసతులు, సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, తనిఖీల్లో ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా విధులు నిర్వహించాలన్నారు. అధిక మొత్తంలో డబ్బు, బంగారు, వెండి ఆభరణాలు, ఇతర వస్తువులు లభిస్తే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎప్పటికప్పుడు చెక్ పోస్టును పర్యవేక్షించాలని ఎస్‌ఐ నాగస్వామిని ఆదేశించారు. ఎస్పీ వెంట డీఎస్పీ టి.శ్రీనివాసులు, ముదిగుబ్బ రూరల్ సీఐ హెచ్.కృష్ణంరాజు నాయక్, ఎస్‌ఐ ఎం.నాగస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాలకు అనుమతి తప్పనిసరి

పుట్టపర్తి టౌన్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా గురువారం నుంచి నామినేషన్ల పర్వం ప్రారంభం కానుండగా పోలీసుశాఖ అప్రమత్తమైంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నామినేషన్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేసింది. అభ్యర్థులు కూడా ఎన్నికల నియమావళిని పాటించాలని ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల నామినేషన్ సందర్భంగా రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ) కార్యాలయానికి 100 మీటర్లు దూరం వరకు మాత్రమే వాహనాలకు అనుమతి ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు ర్యాలీగా వచ్చి నామినేషన్లు వేయాలనుకుంటే పోలీసుల నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. ఆర్‌ఓ కార్యాలయానికి గరిష్టంగా 3 వాహనాలు మాత్రమే పరిమితం చేస్తున్నట్లు తెలిపారు. ఆయా వాహనాలకు కూడా ఆర్‌ఓ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. అనుమతి లేని వాహనాలను అనుమతించబోమన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్ట్రాంగ్ రూంలకు పటిష్ట భద్రత

కదిరి టౌన్: ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూంలకు పటిష్ట భద్రత కల్పించాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. బుధవారం ఆయన కదిరిలో పర్యటించారు. అసెంబ్లీ నియోజకవర్గం, హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను భద్రపరిచిన బాలుర పాఠశాలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, స్ట్రాంగ్ రూంల వద్ద భద్రత పకడ్బందీగా ఏర్పాటు చేయాలన్నారు. ఆర్డీఓ వంశీకృష్ణ, పలువురు తహసీల్దార్లు పాల్గొన్నారు.

పరిటాల డర్టీ పాలిటిక్స్

- ప్రచారం మాటున యథేచ్ఛగా ప్రలోభాలు
- డబ్బు కావాలా? పనులు కావాలా అంటూ ఎర
- వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులకు బలవంతంగా టీడీపీ కండువాలు
- తమ పార్టీ వారికీ కండువాలు వేసి టీడీపీలో చేరారంటూ బిల్డప్
- అధికారం కోసం ఏం చేయడానికైనా సిద్ధమంటోన్న వైనం
- అసహ్యించుకుంటున్న జనం



ఆత్మకూరు మండలం వై.కొత్తపల్లిలో టీడీపీ నాయకులకే కండువాలు వేసిన దృశ్యం (ఫైల్)

- ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ఇంటి వద్దకు ఈ నెల 15న టీడీపీ అభ్యర్థి పరిటాల సునీత సోదరుడు బాలాజీ వెళ్లాడు. ఏదో మాట్లాడుతూనే అతనికి బలవంతంగా టీడీపీ కండువా కప్పారు. వారు గడప దాటిన మరుక్షణమే సదరు వ్యక్తి టీడీపీ కండువా పక్కకు పడేశాడు. అతని కుమారుడు ఆ కండువాకు చెప్పు చూపించడమే కాకుండా నిప్పు పెట్టాడు. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరలైంది.
- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల ఆత్మకూరుకు చెందిన ఓ వార్డు మెంబర్ వైఎస్సార్‌సీపీలో చేరాడు. ఈ క్రమంలోనే అదే రోజు సాయంత్రం సదరు వ్యక్తి ఇంటి వద్దకు బాలాజీ వెళ్లాడు. ఏదో చెప్పి టీడీపీ కండువా వేసి వచ్చారు. కానీ ఆ వార్డు మెంబర్ మాత్రం టీడీపీ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. వైఎస్సార్‌సీపీ కార్యక్రమాలు, సమావేశాలకు హాజరవుతున్నారు.
- కొన్ని రోజుల క్రితం ఆత్మకూరుకు చెందిన నాయీ బ్రాహ్మణులు, కురుబ కులస్తులు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. దీన్ని జీర్ణించుకోని టీడీపీ నాయకులు అదే రోజు రాత్రి వారి ఇళ్ల వద్దకు వెళ్లారు.అధికారంలోకి వస్తే అది చేస్తాం, ఇది చేస్తాం అంటూ నమ్మబలికి టీడీపీ కండువాలు వేశారు.



టాస్క్‌ఫోర్స్: ఎమ్మెల్యే, మంత్రి పదవులను అనుభవించినా రాప్తాడు నియోజకవర్గ అభివృద్ధికి పరిటాల కుటుంబీకులు చేసిన కృషి శూన్యం. పైగా, నమ్మి ఓట్లేసిన పాపానికి ప్రజల్నే వేధించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో యథేచ్ఛగా దోపిడీలు, దౌర్జన్యాలకు పాల్పడ్డారు. అధికారం మాటున వందల కోట్లు వెనకేసుకున్నారు. వారి ఆగడాలతో విసిగిపోయిన ప్రజలు గత ఎన్నికల్లో గుణపాఠం చెప్పారు. ఇంట్లో కూర్చోబెట్టారు. అయినా, బుద్ధి నేర్వని వారు మళ్లీ నేడు ఎన్నికలు వచ్చాయని ప్రజల్లోకి వెళ్తూ నీతిమాలిన రాజకీయాలు చేస్తున్నారు.

పచ్చటి పల్లెల్లో చిచ్చు..

ప్రచారం పేరుతో గ్రామాల్లోకి వెళ్తున్న పరిటాల కుటుంబీకులు ఆ మాటున యథేచ్ఛగా ప్రలోభాలకు దిగుతున్నారు. అధికారంలోకి రావడానికి ఏం చేయడానికైనా రెడీ అంటూ హల్‌చల్ చేస్తున్నారు. సామాన్య ప్రజలు, వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఇళ్ల దగ్గరకు వెళ్లి తమ వైపు తిప్పుకునేందుకు యత్నిస్తున్నారు. ఏ పని కావాలన్నా చేసి పెడతాం లేదా డబ్బు ఎంత కావాలన్నా ఇస్తాం అంటూ ఎర వేస్తున్నారు. పైగా గ్రామీణులను కులాల పేరిట విడగొట్టి సమావేశాలు నిర్వహిస్తూ ఆఫర్లు ఇస్తున్నారు. రాత్రి సమయాల్లో ఒక్కో రోజు ఒక్కో వర్గం వారిని కలుస్తూ ఏ కులంలో ఎంత మంది ఉన్నారంటూ తెలుసుకొని డబ్బు ముట్టజెబుతూ వల వేస్తున్నారు. ఓట్ల కోసం పచ్చటి పల్లెల్లో చిచ్చు పెట్టేందుకు యత్నిస్తున్నారు. ఫ్యాక్షన్ రాజకీయాలకు మళ్లీ బీజం వేస్తున్నారు.

సొంత పార్టీ నాయకులకూ తాయిలాలు..

పరిటాల కుటుంబం సొంత పార్టీ కేడర్‌ను కూడా నమ్మడం లేదు. వారికి కూడా తాయిలాల ఎర వేస్తున్నట్లు తెలిసింది. ఎన్నికల ప్రచారం చేస్తే ఆ రోజంతా ప్రచారంలో పాల్గొనే వారికి మందు, ఖర్చులకు డబ్బుతో పాటు రవాణా ఖర్చులకు కూడా ఇస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైఎస్సార్ సీపీ వారిని, ఆ పార్టీ సానుభూతి పరులను టీడీపీలో చేర్పించి ఎంత కావాలన్నా తీసుకోండి అంటూ కమీషన్లు ఇస్తున్నట్లు సమాచారం. దీంతో గ్రామాల్లో టీడీపీకి చెందిన వారినే సునీత, శ్రీరాం దగ్గరకు తీసుకెళ్లి పార్టీ కండువాలు వేయిస్తూ నాయకులు కమీషన్లు తీసుకుంటున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

బయటకొచ్చాక పారవేస్తున్నారు..

భయపెట్టో, ప్రలోభ పెట్టో తమ వైపు జనాన్ని తిప్పుకోవాలన్న పరిటాల కుటుంబ పాచికలు ఏ మాత్రమూ పారడం లేదు. టీడీపీ కండువాలు కప్పుకున్న వారు బయటకు వచ్చాక వాటిని అక్కడే పడేసి వెళ్లిపోతున్నారు. తమ ఇంటికే వచ్చి పార్టీ కండువాలు వేసి వెళ్లాక వాటిని పారవేస్తున్నారు. కొంతమందైతే తగులబెడుతున్నారు. ఎన్ని రకాలుగా వల పన్నుతున్నా ప్రజలు లొంగకపోవడం చూసి పరిటాల సునీత డీలా పడినట్లు తెలుస్తోంది.

ఓడిపోతామన్న భయంతోనే..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదలందరికీ సంక్షేమ పథకాలు అందాయి. రూపాయి కూడా లంచం తీసుకోకుండా అర్హతే ప్రామాణికంగా లబ్ధి చేకూర్చారు. ఒక్క రాప్తాడు నియోజకవర్గంలోనే ప్రజలకు రూ. వేల కోట్లు ప్రభుత్వం అందించింది. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఎమ్మెల్యేగా గెలిచిన కొన్ని నెలల్లోనే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పేరూరు డ్యాంను నీటితో నింపారు. ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశారు. రూ. వేల కోట్లతో నియోజకవర్గవ్యాప్తంగా అభివృద్ధి పనులు చేపట్టారు. దీంతో ప్రజలు ఈ సారి కూడా వైఎస్సార్ సీపీకి జై కొట్టేందుకు సిద్ధమయ్యారు. ఎన్నికల నేపథ్యంలో ప్రచారానికి వెళ్తున్న తోపుదుర్తి ప్రకాష్ రెడ్డికి ఘన స్వాగతం పలుకుతున్నారు. ఇదంతా గమనించి మళ్లీ ఓటమి తప్పదని గుర్తించిన పరిటాల సునీత ఎలాగైనా, ఏం చేసైనా ఓటర్లను తన వైపు తిప్పుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. బలవంతంగా టీడీపీ కండువాలు కప్పుతూ అపహాస్యం పాలవుతున్నారు. అంతా గమనిస్తున్న ప్రజలు లోలోనే నవ్వుకుంటున్నారు.

108లో ఉద్యోగాలకు దరఖాస్తులు



అనంతపురం మెడికల్: 108 వాహనాల్లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటీ), డ్రైవర్, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు 108 జిల్లా మేనేజర్ సంజీవరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జీఎస్‌ఎం, బీఎస్సీ లైఫ్ సైన్సెస్, బీ ఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్ తదితర కోర్సులు చేసిన వారు ఈఎంటీ పోస్టుకు, పదో తరగతి పరీక్ష ఉత్తీర్ణత, హెవీ లైసెన్స్, 35 ఏళ్లలోపు వయసు కల్గి ఉన్న వారు డ్రైవర్‌కు అర్హులని తెలిపారు. ఆసక్తి కల్గిన వారు ఈ నెల 19వతేదీ లోపు అనంతపురం సర్వజనాస్పత్రిలోని 108 కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

అందుబాటులో హాల్‌టికెట్లు

అనంతపురం ఎడ్యుకేషన్: ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఈనెల 25న నిర్వహించే రాత పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లు అందుబాటులో ఉన్నాయి. 5, 6, 7, 8 తరగతుల్లో ప్రవేశాలకు ఏపీఆర్‌ఎస్ క్యాట్–2024 పరీక్ష ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రవేశాలకు ఏపీఆర్‌జేసీ,డీసీ సెట్–2024 పరీక్ష మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. విద్యార్థుల ఐడీ, పుట్టిన తేదీ ద్వారా https:// aprs. apcfss. in వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. పరీక్ష కేంద్రానికి గంటముందే చేరుకోవాలని సూచించారు.

నేటి నుంచి నామినేషన్ల ఘట్టం



పుట్టపర్తి అసెంబ్లీకి నామినేషన్లు దాఖలు చేసే ఆర్డీఓ కార్యాలయం



బారికేడ్లు ఏర్పాటు చేసిన దృశ్యం

- నేడే ఎన్నికల నోటిఫికేషన్
- ఉదయం 11 గంటల నుంచే నామినేషన్ల స్వీకరణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన జిల్లా యంత్రాంగం
- 25వ తేదీ వరకూ నామినేషన్లకు అవకాశం

నామినేషన్లు స్వీకరించే కార్యాలయాలు, అధికారులు

నియోజక వర్గం	కార్యాలయం	అధికారి
హిందూపురం (పార్లమెంట్)	కలెక్టరేట్	అరుణ్‌బాబు (కలెక్టర్)
హిందూపురం (అసెంబ్లీ)	తహసీల్దార్ కార్యాలయం	అభిషేక్ కుమార్ (జేసీ)
మడకశిర (అసెంబ్లీ)	మడకశిర తహసీల్దార్ కార్యాలయం	గౌరీ శంకర్ (అహుడా)
పెనుకొండ (అసెంబ్లీ)	సబ్ కలెక్టర్ కార్యాలయం	అపూర్వ భరత్ (సబ్ కలెక్టర్)
ధర్మవరం (అసెంబ్లీ)	ఆర్డీఓ కార్యాలయం	వెంకటశివరామిరెడ్డి (ఆర్డీఓ)
పుట్టపర్తి (అసెంబ్లీ)	ఆర్డీఓ కార్యాలయం	భాగ్యరేఖ (ఆర్డీఓ)
కదిరి (అసెంబ్లీ)	ఆర్డీఓ కార్యాలయం	సన్నీ వంశీకృష్ణ (ఆర్డీఓ)

పుట్టపర్తి అర్బన్: సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ ఈ నెల 18న గురువారం విడుదల కానుంది. ఉదయం ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేయగానే... జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు, పార్లమెంట్ స్థానానికి ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. ఆ వెంటనే ఉదయం 11 గంటల నుంచే నామినేషన్లు స్వీకరించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఎంపీ స్థానానికి కలెక్టరేట్‌లో నామినేషన్ల స్వీకరణ..

జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల నామినేషన్ల స్వీకరణ ఆయా నియోజకవర్గాల కేంద్రాల్లో ఉంటుంది. పార్లమెంట్ నియోజకవర్గానికి మాత్రం కలెక్టరేట్‌లో నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేశారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గ నామినేషన్ కేంద్రంలో 5 నుంచి 9 వరకూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అభ్యర్థితో పాటు నలుగురికి మాత్రమే నామినేషన్ కేంద్రంలోకి అనుమతి ఉండడంతో కేంద్రం చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేశారు. అభ్యర్థి వెంట వచ్చే కార్యకర్తలు, వాహనాలు ఆర్‌ఓ కార్యాలయానికి వంద మీటర్ల దూరంలోనే ఉంచేందుకు చర్యలు తీసుకున్నారు. కేంద్రం సమీపంలో పోలీస్ డిటెక్టర్‌ను ఏర్పాటు చేసి లోనికి వెళ్లే ప్రతి ఒక్కరినీ చెక్ చేసి పంపేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఒక్కో అభ్యర్థికి నాలుగు సెట్ల వరకూ అవకాశం..

అభ్యర్థులు నామినేషన్ పత్రాలను సక్రమంగా పూర్తి చేసి సంబంధిత రిటర్నింగ్ అధికారికి అందజేయాల్సి ఉంటుంది. ఏవైనా తప్పులుంటే మరోసారి నామినేషన్ దాఖలు చేయవచ్చు. ఒక్కో అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్లు అందజేయవచ్చు. వివిధ పార్టీల తరపున పోటీ చేసే వారికైతే నలుగురు, స్వతంత్ర అభ్యర్థులకైతే పది మంది బలపరిచే వ్యక్తులు అదే నియోజక వర్గానికి సంబంధించిన వారై ఉండాలి. నామినేషన్‌లో ఏవైనా పొరపాట్లు జరిగితే నామినేషన్ తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉంది. అఫిడవిట్‌లో వివరాలు తప్పుగా నమోదు చేసి ఎన్నికల్లో విజయం సాధించినా... ప్రత్యర్థులు కోర్టులను ఆశ్రయించి ధ్రువీకరిస్తే పదవి కోల్పోయే ప్రమాదం ఉంది. అందువల్ల నామినేషన్ పత్రాల్లో వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు.

మధ్యాహ్నం 3 గంటల వరకే స్వీకరణ..

నామినేషన్ల ప్రక్రియ 18వ తేదీ ఉదయం 11 గంటల నుంచి ప్రారంభమవుతుంది. 25వ తేదీ వరకూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ నామినేషన్లు స్వీకరిస్తారు. ఉపసంహరణకు ఈ నెల 29వ తేదీ వరకూ గడువు ఉంటుంది. ఓటింగ్ డే మే 13న ఉంటుంది.


144 సెక్షన్ అమలు



నామినేషన్‌లు దాఖలు చేసే అన్ని ఆర్‌ఓ కార్యాలయాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితో పాటు నలుగురికి మాత్రమే కేంద్రంలోని అనుమతి ఇస్తాం. వాహనాలన్నీ నామినేషన్ కేంద్రం వంద మీటర్ల అవతలే నిలిపి వేయాలి. 3 వాహనాలకు మాత్రం అనుమతి ఉంటుంది.
– అరుణ్‌బాబు, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్

బెడిసికొట్టిన మంత్రాంగం

- ఇక్బాల్‌కు శృంగభంగం
- మీలా రోజుకో పార్టీ మారలేం
- ముఖంపైనే చెప్పిన వైఎస్సార్ సీపీ నేతలు



హిందూపురం అర్బన్: ఎన్నికల్లో ఎలాగైనా గెలిచేందుకు టీడీపీ అడ్డదారులన్నీ తొక్కుతోంది. ముఖ్యంగా హిందూపురంలో ఈ సారి ఓటమి ఖాయంగా తేలడంతో బాలకృష్ణ కోసం ఆ పార్టీ నేతలు పడరాని పాట్లు పడుతున్నారు. చివరకు వైఎస్సార్ సీపీ నేతలను ఆకట్టుకునేందుకు ప్లాన్ వేశారు. ఇందుకోసం వైఎస్సార్ సీపీ నుంచి ఇటీవలే టీడీపీలో చేరిన ఇక్బాల్‌ను ప్రయోగించారు. మంగళవారం మధ్యాహ్నం ఆయన కొడికొండ చెక్‌పోస్టు సమీపంలో బస చేసి హిందూపురానికి చెందిన వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకులు, కొందరు కౌన్సిలర్లను పిలిపించారు.

మేం మీలా కాదు ఇక్బాల్..

హిందూపురం నేతలతో పరామర్శల తర్వాత ఇక్బాల్.. మైనార్టీలకు వైఎస్సార్‌సీపీలో సరైన గౌరవం లేదని టీడీపీలో చేరితే మంచి అవకాశాలు ఇప్పిస్తానంటూ చెప్పబోయారు. అప్పటివరకూ సార్ అంటూ గౌరవంతో పిలిచిన వైఎస్సార్ సీపీ నాయకులు వెంటనే ఏకవచనంతో ఆయన్ను కడిగి పారేశారు. ''మేం మీలా కాదు.. స్వార్థం కోసం రోజుకో పార్టీ మారలేం.. మా నాయకుడు మాకు ఎప్పుడూ అన్యాయం చేయరు. మీకు కూడా వైఎస్సార్ సీపీలో ఎంతో గౌరవం ఇచ్చారు. అయినా మీరు అన్యాయంగా ప్రవర్తించారు. ఇందుకోసమే మమ్మల్ని పిలిపించి ఉంటే అది తప్పు. ఇక వస్తాం '' అంటూ అక్కడి నుంచి వచ్చేశారు. ఇంతలా ఎదురుదాడి ఊహించని ఇక్బాల్ అవమాన భారంతో అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. అందుకే ఆయన హిందూపురానికి రాలేకపోయారని టీడీపీ నేతలే చెబుతున్నారు.

పార్టీ ఫిరాయించిన వారికీ అవమానం..

ఇక్బాల్ మాటలు నమ్మి చిలమత్తూరుకు చెందిన ఒకరిద్దరు టీడీపీలో చేరినా వారికి అక్కడి నేతలతో పొసగడం లేదు. ఇన్నాళ్లూ తమను తిట్టి ఇప్పుడు తమ పంచనే చేరారంటూ టీడీపీ నేతలు చులకనగా మాట్లాడుతున్నారని పార్టీ ఫిరాయించిన ఓ నేత అనుచరులతో వాపోయినట్లు తెలుస్తోంది. ఇక ఇటీవల టీడీపీలో చేరిన చిలమత్తూరు మహిళా నేత ఇటీవల బాలకృష్ణ సతీమణి వసుంధరతో కలిసి ప్రచారం చేసేందుకు ప్రయత్నించగా... స్థానిక టీడీపీ మహిళా నేతలు ఆమెను ప్రచారవాహనం పైకి కూడా ఎక్కనివ్వలేదు. దీంతో పరువుపోయినట్లు భావించిన ఆమె కన్నీటిపర్యంతమవుతూ... అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం.

విచ్చలవిడిగా నగదు తరలింపు..

హిందూపురం టీడీపీ అభ్యర్థి బాలకృష్ణ ఈ నెల 19వ తేదీన నామినేషన్ వేసేందుకు సిద్ధమయ్యారు. దీంతో జనసమీకరణకు ఆ పార్టీ నేతలు విచ్చలవిడిగా ఖర్చు చేసేందుకు సిద్ధమయ్యారు. హిందూపురంలోని వివిధ వార్డులతో పాటు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి జనాన్ని తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం భారీగా నగదు తరలిస్తున్నారు. అయితే సామాన్యుల వాహనాలను తనిఖీ చేసే పోలీసులు టీడీపీ నేతల వాహనాలను మాత్రం తనిఖీ చేయకపోవడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదు.

రమణీయం.. రాములోరి కల్యాణం



తాడిమర్రి ఓసీ కాలనీలోని రామాలయంలో పూజలు అందుకుంటున్న సీతారాములు



కదిరి పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో కల్యాణోత్సవం సందర్భంగా మాంగల్యాన్ని భక్తులకు చూపుతున్న అర్చకుడు



ప్రశాంతి నిలయంలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



పోట్లమర్రిలో ఉట్లమాను ఎక్కేందుకు పోటీపడుతున్న యువకులు

పుట్టపర్తి టౌన్: శ్రీరామ నామస్మరణతో జిల్లా మార్మోగిపోయింది. ఆధ్యాత్మిక శోభతో అలరారింది. జగదానంద కారకుని కల్యాణంతో ప్రతి లోగిలీ కాంతులీనింది. శ్రీరామనవమి వేడుకలు బుధవారం జిల్లా వ్యాప్తంగా వైభవంగా జరిగాయి. గ్రామగ్రామానా శ్రీరామ కల్యాణోత్సవాలు కమనీయంగా సాగాయి. నీలిమేఘ శ్యాముడు రామచంద్రుడు సర్వాభరణ భూషితుడై కల్యాణ వేదికపై కొలువుదీరగా... సుగుణాల తల్లి సీతమ్మతో వేద పండితులు కల్యాణం జరిపించారు. ఈ పరిణయాన్ని కళ్లారా తిలకించిన భక్తజనం పులకించింది. చాలా ప్రాంతాల్లో నిర్వాహకులు పానకం, పెసర పప్పు తీర్థ ప్రసాదంగా భక్తులకు పంచిపెట్టారు. పలు ప్రాంతాల్లో ఉట్ల పరుష నిర్వహించడంతో యువకులు కేరింతలు కొట్టారు. మరికొన్ని ప్రాంతాల్లో స్వామి విగ్రహాలు ఊరేగింపులు, రథోత్సవాలు నిర్వహించారు. అలాగే హనుమాన్ దేవాలయాలకు కూడా భక్తులు పోటెత్తారు.

ప్రశాంతి నిలయంలోనూ వేడుకలు..

ప్రశాంతి నిలయం: శ్రీ రామ నవమి వేడుకలు ప్రశాంతి నిలయంలోనూ ఘనంగా జరిగాయి. బుధవారం ఉదయం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత వేడుకలు వేదపఠనంతో ప్రారంభమయ్యాయి. సీతారామ లక్ష్మణ సమేత హనుమంతుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన వేదపండితులు.. సాయికుల్వంత్ సభా మందిరంలోని సత్యసాయి మహాసమాధి వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం సీతారాముల కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు కల్యాణోత్సవ ఘట్టాన్ని తిలకించి పరవశించారు. సాయంత్రం జరిగిన వేడుకల్లో ప్రముఖ నేపథ్య గాయని గాయత్రి నారాయణన్ సత్యసాయిని కీర్తిస్తూ సంగీత కచేరీ నిర్వహించారు.

క్లుప్తంగా

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం


వజ్ర భాస్కర్‌రెడ్డి

కదిరి టౌన్/ పుట్టపర్తి టౌన్: సంక్షేమ రాజ్యం కోసం జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందామని వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వజ్ర భాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికల పరిశీలకునిగా తనను నియమించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సహకరించిన జిల్లా అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్, ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ, కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్‌తో పాటు మిగతా ఆరుగురు ఎమ్మెల్యే అభ్యర్థులకు ధన్యవాదాలు తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పేదలకు – పెట్టుబడిదారులకు మధ్య జరగబోయే ప్రతిష్టాత్మక ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ క్లీన్‌స్వీప్ చేసి, జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలనే లక్ష్యంగా ఉన్నామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుని విజయకేతనం ఎగురవేస్తామన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గుడిబండ: కుటుంబ పోషణ భారమై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. కరికెర గ్రామానికి చెందిన రంగధామప్ప (41) కూలీ. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. కొంతకాలంగా రంగధామప్ప మద్యానికి బానిసయ్యాడు. సంపాదించిన డబ్బు మొత్తం మద్యం తాగడానికే ఖర్చు చేసేవాడు. ఈ క్రమంలో కుటుంబ పోషణ భారమైంది. జీవితంపై విరక్తిచెందిన రంగధామప్ప మద్యం మత్తులోనే బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరివేసుకున్నాడు. తల్లి లక్కమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు.

మహిళపై మూకుమ్మడి దాడి

కదిరి అర్బన్: మహిళపై బంధువులు మూకుమ్మడిగా దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటనలో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు కదిరి రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ మోహన్ బుధవారం తెలిపారు. వివరాల్లోకెళ్తే... కుమ్మరవాండ్లపల్లిలో నివాసం ఉంటున్న గంగాదేవి, రామాంజనేయులు దంపతులు. తమ ఇంట్లో గుప్తనిధులు ఉన్నాయని, వాటిని వెలికి తీయాలంటే ఖర్చవుతుందని గంగాదేవి తమ బంధువులైన గుర్రప్ప, సుగుణ, భారతి, గురుప్రసాద్, కదిరికి చెందిన మరో వ్యక్తి శంకర్‌కు తెలిపింది. ఆమె మాటలతో ఆశకుపోయిన వారంతా కలిసి కోటీ నాలుగు లక్షల రూపాయలు పోగు చేసి గంగాదేవి, రామాంజనేయులు దంపతుల ద్వారా గుప్తనిధులు వెలికితీసే గాలివీడుకు చెందిన బాలరాజుకు అందజేశారు. మూడేళ్లు గడిచినా బాలరాజు గుప్తనిధులు బయటకు తీసేందుకు రాలేదు. అనుమానం వచ్చిన బంధువులు తమ డబ్బులు వెనక్కు ఇవ్వాలని గంగాదేవిపై ఒత్తిడి చేస్తూ వచ్చారు. సరైన స్పందన లేకపోవడంతో బుధవారం ఉదయం గంగాదేవిపై మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు. గంగాదేవి ఫిర్యాదు మేరకు ఆమె బంధువులైన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ మోహన్ తెలిపారు. ఇందులో కీలకమైన వ్యక్తి బాలరాజు పాత్రపై కూడా విచారణ చేస్తామని చెప్పారు.

వెల్లివిరిసిన జీవ కారుణ్యం

- మనిషైనా, పశువైనా ప్రాణం ఒక్కటేనని నిరూపించిన జగన్ సర్కార్
- పశు, జీవసంపద సంరక్షణకు ఉచితంగా మందులు
- ఐదేళ్లలో ఉమ్మడి జిల్లాలో రూ.20 కోట్లు వెచ్చించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ఏటా షెడ్యూల్ ప్రకారం 15 రకాల జబ్బుల నివారణకు ఉచితంగా టీకాలు
- ప్రమాదకర, ప్రాణాంతక వ్యాధులు ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు

ప్రతి జీవికీ జీవించే హక్కు ఉంటుందని, దానిని కాలరాయకూడదనే బుద్ధుడి ధర్మ ప్రబోధాన్ని అనుసరిస్తూ జీవ కారుణ్యానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేస్తూ వచ్చారు. దేశంలోని మరే రాష్ట్రంలోనూ లేని విధంగా ఏపీలో సీఎం వైఎస్ జగన్ పాలనలో జీవ కారుణ్యం వెల్లివిరుస్తోంది. మనుషులపైనే కాకుండా జంతువులపై కూడా కరుణ, దయ చూపించారు. వాటి సంరక్షణకు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. మనిషైనా... పశువైనా ప్రాణం ఒక్కటేనని, వాటికీ జీవించే హక్కు ఉందంటూ ఈ ఐదేళ్లలో రూ.20 కోట్లు వెచ్చించి ప్రాణాంతక వ్యాధుల బారి నుంచి పశు, జీవసంపదను కాపాడారు.


టీకాల అనంతరం కోలుకున్న గేదె, ఆవు


పశువుకు ఉచిత టీకా వేస్తున్న పశువైద్యాధికారులు

అనంతపురం అగ్రికల్చర్: రాష్ట్రంలో పశువైద్యానికి, జీవాల సంరక్షణకు జగన్ సర్కార్ అత్యంత ప్రాధాన్యత ఇచ్చింది. మనుషులైనా, జంతువులైనా 'ప్రాణం' ఒక్కటే అని భావించి పశు, జీవ సంపద పరిరక్షణకు పెద్దపీట వేసింది. మానవ జీవితాన్ని కబలించిన కోవిడ్ లాంటి ప్రాణాంతక వ్యాధులు, మూగజీవాలకు సంక్రమించే ప్రమాదకరమైన అంటు వ్యాధులు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా క్రమం తప్పకుండా ఉచితంగా టీకాలు అందజేసింది. ఇందు కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద ఎత్తున బడ్జెట్ కేటాయించారు. గ్రామ గ్రామాన ఆర్‌బీకేలు అందుబాటులోకి తీసుకువచ్చి, విలేజ్ అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్ల (వీఏహెచ్‌ఏ) నియామకం జరగడంతో వ్యాక్సినేషన్ ప్రక్రియ ఊపందుకుంది. ఆన్‌లైన్ నమోదు కార్యక్రమం ద్వారా మారుమూల గ్రామాల్లో సైతం సకాలంలో పశు, జీవ సంపదర రక్షణకు చర్యలు చేపట్టారు.

15 రకాల వ్యాధుల నివారణకు ఉచితంగా టీకాలు:

పశువులు గేదెలు, ఎద్దులకు సోకే గొంతువాపు (హెచ్‌ఎస్), చొప్ప వాపు (బీక్యూ), గొర్రెలు వ్యాపించే చిటుకు రోగం (ఈటీ), పశువులు, జీవాలు, మనుషులకు వ్యాపించే అంత్రాక్స్ (దొమ్మరోగం), ఈసుడురోగం (బ్రూసెల్లోస్), గొర్రెలకు బొబ్బరోగం (ఎస్‌పీటీసీ), కోళ్లకు వ్యాపించే కొక్కెర తెగులు (ఆర్‌డీకే, ఎఫ్‌పీ), మసూచి (ఆర్‌డీఎఫ్-1), పిచ్చికుక్క వ్యాధి (ఏఆర్‌వీ), జీవాలకు వ్యాపించే పారుడు రోగం (పీపీఆర్), మేకల్లో వచ్చే బొబ్బరోగం (గోట్‌ఫాక్స్), జీవాలను కబలించే నీలినాలుక వ్యాధి (బ్లూటంగ్), పశువులను దెబ్బతీసే గాలికుంటురోగం (ఫుట్ అండ్ మౌత్ డిసీసెస్), బాతులకు సోకే బూతుపారుడు, బాతు ప్లేగు (డక్‌ప్లేగ్) తదితర ప్రాణాంతక, ప్రమాదకరమైన వ్యాధులు, జబ్బులు, రోగాల నివారణకు ముందస్తుగా పెద్ద ఎత్తున ఉచితంగా టీకాలు వేసేలా జగన్ సర్కార్ చర్యలు తీసుకుంది. వీటితో పాటు జీవాలకు నట్టలు సోకకుండా డీవార్మింగ్, అలాగే 2022లో పశువులను కబలించిన ముద్దచర్మవ్యాధి (లంపీ స్కిన్ డిసీసెస్) నివారణకు సరిహద్దు ప్రాంతాలతో పాటు అనుమానిత గ్రామాల్లో పెద్ద ఎత్తున ఉచితంగా టీకాలు వేయడంతో వాటిని సకాలంలో నివారించి పశువులు, జీవాల రక్షణ చర్యలు చేపట్టారు. అలాగే జీవాలకు నట్టల మందు (డీవార్మింగ్) ఉచితంగా తాపించే కార్యక్రమం షెడ్యూల్ ప్రకారం పశుసంవర్ధకశాఖ ద్వారా చేపడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో రూ.20 కోట్ల విలువైన వ్యాక్సిన్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత ఐదేళ్లలో వివిధ రకాల జబ్బులకు ఏకంగా రూ.20 కోట్లు వెచ్చించి 4.23 కోట్ల డోసుల వాక్సిన్‌ను ఉచితంగా అందించి జీవ కారుణ్యానికి పెద్ద పీట వేశారు. షెడ్యూల్ ప్రకారం వ్యాధుల నివారణకు ఉచిత వ్యాక్సినేషన్ ప్రక్రియ కొనసాగించడంతో పాడి ఉత్పత్తి, జీవ సంతానోత్పత్తి పెరిగిందని రెండు జిల్లాల పశుసంవర్ధక శాఖ జేడీలు డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం, డాక్టర్ బి.శుభదాస్ తెలిపారు.

గత ఐదేళ్లలో వివిధ రకాల జబ్బుల నివారణకు ఉచిత వ్యాక్సిన్ డోసుల వివరాలు ఇలా

వ్యాధి	2019	2020	2021	2022	2023
హెచ్‌ఎస్	86,530	1.41 లక్షలు	1,72,500	5,18,550	3,75,550
బీక్యూ	6 వేలు	2,550	8,820	53,240	79,650
ఈటీ	7,07,300	10,51,350	5,90,700	20,45,500	14,00,300
అంత్రాక్స్	2.16 లక్షలు	82,300	2,69,800	1,71,800	1,07,800
బ్రూసెల్లా	4,500	00	00	78 వేలు	00
ఎస్‌పీటీసీ	6.37 లక్షలు	1,55,600	10,34,900	7,49,900	3.95 లక్షలు
ఆర్‌డీకే	3.96 లక్షలు	6.20 లక్షలు	ఒక లక్ష	8,27,200	10,59,400
ఆర్‌డీఎఫ్-1	1.61 లక్షలు	2.23 లక్షలు	ఒక లక్ష	4,48,300	85,400
ఎఫ్‌పీ	88 వేలు	00	51 వేలు	00	2.54 లక్షలు
ఏఆర్‌వీ	4 వేలు	7,700	10,220	52,890	40,240
పీపీఆర్	46.50 లక్షలు	18,68,900	54,39,800	54.04 లక్షలు	1,54,500
గోట్‌ఫాక్స్	44,100	45,900	96,500	1,13,500	5,15,600
బ్లూటంగ్	57 వేలు	29,100	19,99,600	24,75,850	16,70,750
ఎఫ్‌ఎండీ	00	7,04,300	00	7,04,300	7,04,200
డక్‌ప్లేగ్	00	00	00	00	1,600
మొత్తం డోసులు	70,57,430	49,41,700	98,73,840	1,36,43,030	68,43,990

కోన రంగనాథుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం


అలంకరణలో రంగనాథస్వామి మూలవిరాట్

తాడిపత్రి టౌన్: మండలంలోని ఆలూరు కోన రంగనాయకుల స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభం అయ్యాయి. ఈ నెల 27 వరకూ ఉత్సవాలు కొనసాగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం ఉదయం ఆలూరు కోనలో ధ్వజారోహణతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ఈ నెల 23న ఆలూరు గ్రామంలో కల్యాణోత్సవం, రథోత్సవం ఉంటుంది. 25న ఆలూరు కోనలో చక్రస్నానం, వసంతోత్సవం, పుష్పయాగం నిర్వహించనున్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు గురి కాకుండా ఏర్పాట్లు చేసినట్లు ఈఓ సుబ్రహ్మణ్యం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు


పరిస్థితి విషమంగా ఉన్న అనిల్‌కుమార్


తీవ్రంగా గాయపడిన రాకేష్

బత్తలపల్లి: సంజీవపురంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. బత్తలపల్లి మండలం వేల్పుమడుగు గ్రామానికి చెందిన బోరు మెకానిక్ అనిల్‌కుమార్, రాప్తాడుకు చెందిన ఇంటర్ విద్యార్థి రాకేష్ ఇద్దరూ కలిసి రాప్తాడు నుంచి బైకులో బత్తలపల్లికి వచ్చారు. అనంతరం తిరిగి రాప్తాడుకు బైక్‌పై వెళుతుండగా సంజీవపురం వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ పి.శ్రీనివాసులు తమ సిబ్బందితో సంఘటనాస్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను తన వాహనంలోనే తీసుకువచ్చి ఆర్డీటీ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో అనిల్‌కుమార్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత


కర్ణాటక మద్యంతో పట్టుబడిన ఇన్నోవా వాహనం

హిందూపురం అర్బన్: ఏపీలోకి వచ్చిన కర్ణాటక మద్యాన్ని సెబ్ అడిషనల్ ఎస్పీ నాగభూషణం తన సిబ్బందితో పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. లేపాక్షి మండలం కంచిసముద్రం రహదారిలో బయన్నపల్లి క్రాస్ వద్ద బుధవారం సెబ్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఓ ఇన్నోవా వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 30 బాక్సుల (2880 టెట్రా పాకెట్లు) కర్ణాటక మద్యం దొరికింది. వీటిని తరలిస్తున్న సోమందేపల్లి మండలం పందిపర్తికి చెందిన హిమామ్ సాబ్, రామాంజనేయులుపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేశారు. మద్యంతో పాటు ఇన్నోవా వాహనం సీజ్ చేసినట్లు తెలిపారు. అలాగే కర్ణాటక నుంచి హిందూపురం వైపు ఉన్న దారిలో మానెంపలి వద్ద తనిఖీలు చేపట్టగా హోండా యాక్టివా ద్విచక్ర వాహనంలో 5 బాక్సులు (528 టెట్రా పాకెట్లు) మద్యం పట్టుకున్నారు. హిందూపురానికి చెందిన బాబు అనే వ్యక్తిని అరెస్ట్ చేసి మద్యంతో పాటు వాహనాన్ని సీజ్ చేసినట్లు వెల్లడించారు. ఈ దాడుల్లో సెబ్ సీఐ రాజశేఖర్ గౌడ్, ఎస్‌ఐలు రామ్‌ప్రసాద్, కమలాకర్, సిబ్బంది ప్రకాష్, భాస్కర్, రమణ, ఆంజనేయులు పాల్గొన్నట్లు వారు తెలిపారు.

గొడుగుల మెరవణి


పురవీధుల గుండా సాగుతున్న స్వామివారి గొడుగుల ఊరేగింపు


వేమన సమాధివద్ద పూజలు చేస్తున్న భక్తులు

గాండ్లపెంట: కటారుపల్లి యోగి వేమన ఉత్సవాల్లో చివరిరోజు బుధవారం రాత్రి ఆలయ పీఠాధిపతుల ఆధ్వర్యంలో స్వామివారి గొడుగులను పుర వీధుల్లో ఊరేగించారు. అనంతరం గొడుగులను ఆలయంలో భద్రపరిచారు. ఉమ్మడి జిల్లాల నుంచే కాక, వైఎస్సార్, నెల్లూరు, కర్నూలు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో వేమన భక్తులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా కదిరి రూరల్ సీఐ వెంకటేశ్వర్లు, గాండ్లపెంట ఎస్‌ఐ కృష్ణవేణి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అవగాహనతోనే ప్రమాదాల నివారణ


గ్యాస్ ప్రమాద నివారణపై అవగాహన కలిగిస్తున్న ఫైర్ సిబ్బంది

పుట్టపర్తి టౌన్: అవగాహన కలిగి ఉంటే ప్రమాదాలు నివారించగలుగుతామని అగ్నిమాపక శాఖ ఏడీఎఫ్‌ఓ నాగరాజునాయక్ పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో నాలుగోరోజు బుధవారం పుట్టపర్తిలోని శ్రీనివాస, సాయిరుషి అపార్టుమెంట్లు, హోటళ్లు, రద్దీ ప్రదేశాలతో పాటు కర్ణాటక నాగేపల్లి బ్రిడ్జి వద్ద గ్యాస్ స్టౌలు, మాక్ డ్రిల్ విన్యాసాలతో ప్రజలకు అవగాహన కల్పించారు. వేసవిలో ఎక్కువగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్, గ్యాస్ లీకేజీ, గడ్డి వాములకు నిప్పు, పూరిపాకలు కాలిపోవడం సంభవిస్తుంటాయి. ఒక్కోసారి చిన్న ప్రమాదాలు పెద్దవై భారీ నష్టం జరుగుతుంది. అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు ఏ విధంగా బయటపడాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి తదితర విషయాలపై అవగాహన కోసం సిబ్బంది కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది నరసింహులు, రామాంజనేయులు, దేవ్లానాయక్, వెంకటరెడ్డి, దామోదర్, తేజేశ్వరరెడ్డి, వేణుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే నాయీబ్రాహ్మణుల అభ్యున్నతి

- నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పుల్లయ్య
- జగనన్నను మరోసారి సీఎం చేసుకుందాం


సంక్షేమ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పుల్లయ్య, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి

గుంతకల్లు టౌన్: నాయీబ్రాహ్మణుల సంక్షేమం, అభ్యున్నతి, రాజకీయ భవిష్యత్తు సీఎం జగనన్నతోనే సాధ్యమని రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తొండమళ్ల పుల్లయ్య అన్నారు. బుధవారం గుంతకల్లుకు విచ్చేసిన ఆయన స్థానిక ఎమ్మెల్యే వైవీఆర్ క్యాంప్ కార్యాలయంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. 14 ఏళ్లు సీఎంగా పని చేశానని గొప్పలు చెప్పుకునే చంద్రబాబుకు నాయీబ్రాహ్మణులంటే చాలా చిన్నచూపన్నారు. కల్యాణకట్టలో పనిచేస్తున్న క్షురకులకు వేతనాలు ఇవ్వాలని అడిగినందుకు అంతు చూస్తానని, తోకలు కత్తిరిస్తానని అవమానించిన చంద్రబాబు తీరును నేటికీ ఎవరూ మరవలేదన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా టీటీడీతో పాటు రాష్ట్రంలోని 1,150 దేవాలయాల్లో పాలక మండలి సభ్యులుగా నాయీ బ్రాహ్మణులకు అవకాశం కల్పించిన మహోన్నత వ్యక్తి సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. కుల వృత్తిపై ఆధారపడిన వారికి జగనన్న చేదోడు పథకం ద్వారా ఆర్థిక సాయం అందజేయడంతో పాటు ప్రతి సెలూన్ షాపు నిర్వహణకు 150 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆలయాల్లోని కల్యాణకట్టలో పనిచేసే క్షురకులకు నెలకు రూ.20 వేల వేతనం అందజేస్తూ ఆర్థిక ప్రగతికి బాటలు వేశారన్నారు. జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతోనే తమ పిల్లల భవిష్యత్తు బంగారమయమవుతోందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ప్రతి అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం జగనన్న హయాంలో నాయీబ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధికి గుంతకల్లు ఎమ్మెల్యే చేపట్టిన కార్యక్రమాలతో కూడిన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే వైవీఆర్ కుమార్తె నైరుతిరెడ్డి, మంజునాథ్‌రెడ్డితో కలసి ఆవిష్కరించారు. సమావేశంలో నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు ప్రసాద్, నీలకంఠ, శేఖర్, రఘు, చిట్టిబాబు, నరేష్, బ్రహ్మ, శివ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఏ ఫాం.. బీ ఫాం అంటే..



హిందూపురం టౌన్: గుర్తింపు పొందిన జాతీయ, ప్రాంతీయ పార్టీలు ఎన్నికల్లో తమ అభ్యర్థులను ప్రతిపాదిస్తూ ఇచ్చే పత్రాన్ని బీ ఫాం అంటారు. నామినేషన్ సమర్పించే సమయంలో అభ్యర్థులు తమ రాజకీయ పార్టీలిచ్చిన బీ ఫాం దాఖలు చేయాలి. అప్పుడే ఆ అభ్యర్థికి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ గుర్తు కేటాయిస్తారు. బీ ఫాంను పార్టీ అధ్యక్షుడు నిర్ణయించిన వ్యక్తి జారీ చేస్తారు. బీ ఫాం జారీ చేసేందుకు సంబంధిత వ్యక్తికి పార్టీ అధ్యక్షుడు ఆమోదాన్ని తెలుపుతూ ఏ ఫాం అందజేస్తారు. ఏ ఫాం ఎవరి పేరుతో అధ్యక్షుడు ఇస్తారో, ఈ వ్యక్తికి పోటీ చేసే అభ్యర్థులకు బీ ఫాం ఇచ్చే అధికారం ఉంటుంది. తన పేరుమీద అందజేసిన ఏ ఫాంను ఆయా నియోజకవర్గాల్లోని ఎన్నికల అధికారులకు సంబంధిత వ్యక్తి అందజేయాల్సి ఉంటుంది.

అభ్యర్థుల ఖర్చుపై షాడో అకౌంట్..

ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థులు రూ.40 లక్షలు, ఎంపీ అభ్యర్థులు రూ.95 లక్షలు మాత్రమే ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించిన అభ్యర్థుల ఖర్చును లెక్కించేందుకు ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు షాడో అకౌంట్ నిర్వహిస్తారు. ఇన్‌కం ట్యాక్స్, సెంట్రల్ ఎక్సైజ్‌లో యూడీసీ స్థాయి అధికారులతో బృందాలు ఏర్పాటు చేశారు. నామినేషన్ దాఖలు తర్వాత అభ్యర్థి ఖర్చు చేసే ప్రతీ రూపాయి అకౌంట్‌లోకి వస్తుంది. ఆయా ప్రాంతాల్లో జరిగే ప్రచారం మొత్తం వీడియో తీయించి టేపుల్ని పూర్తి స్థాయిలో పరిశీలించేందుకు బృందాలు ఏర్పాటయ్యాయి. వీటి ద్వారా ఖర్చు లెక్కిస్తారు. ప్రచారంలో నిర్వహించే కందువాలు, జెండాల నుంచి అన్ని ఖర్చులనూ లెక్కించేందుకు డీపీసీ (డిస్ట్రిక్ ప్రొక్యూర్‌మెంట్ కమిటీ) జాయింట్ కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి. వీరికి పూర్తి స్థాయిలో శిక్షణ ఇచ్చారు.

పోటాపోటీగా ఇరుసు పోటీలు


ఇరుసు ఎత్తుతున్న యువకుడు

గార్లదిన్నె: మండలంలోని కల్లూరు అగ్రహారంలో బుధవారం శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో యువకులకు ఇరుసు ఎత్తే పోటీలు నిర్వహించారు. 30 మంది యువకులు పోటాపోటీగా తలపడ్డారు. 4వ బ్యాచ్‌లో పామిడి మండలం బోడిసానిపల్లికి చెందిన శ్రీకాంత్ మొదటి స్థానం, కూడేరు మండలం అరవకూరుకు చెందిన కళ్యాణ్ రెండో స్థానంలో గెలుపొందారు. అలాగే 6వ బ్యాచ్‌లో ఆత్మకూరు మండలంతోపు దుర్తికి చెందిన మహేష్ మొదటి స్థానం, కల్లూరుకు చెందిన అప్పి రెండో స్థానాన్ని దక్కించుకున్నారు. 7వ బ్యాచ్‌లో బోడిసానిపల్లికి చెందిన రవి మొదటి స్థానం, గుంతకల్లు మండలం నెలగొండకు చెందిన మోహన్ రెండో స్థానంలో నిలిచారు. విజేతలను అభినందిస్తూ నగదు పురస్కారాలతో నిర్వాహకులు సత్కరించారు.